
వరంగల్ కరీమాబాద్‌లో బీరన్నకు బోనమెత్తిన మంత్రి సురేఖ, పక్కన మేయర్ గుండు సుధారాణి


బీరన్నకు బోనాలు సమర్పించేందుకు క్యూలో వెళ్తున్న మహిళలు

# బోనమో బీరన్న



## ఆకట్టుకున్న డప్పుచప్పుళ్లు, కోలాటాలు

- నెత్తిన బోనాలతో మహిళల బారులు
- వరంగల్‌లో వైభవంగా సంప్రదాయ వేడుక
- ఓసిటీ, ఉర్సులో పాల్గొన్న మంత్రి సురేఖ

తొలి ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం కురుమలు బీరన్న పండుగను ఘనంగా జరుపుకొన్నారు. డప్పుచప్పుళ్లు, కోలాటాలు, పోతరాజుల విన్యాసాలు, ఒగ్గు కళాకారుల నృత్యాలు, నెత్తిన బోనాలతో మహిళల బారులు, గొర్రె పిల్లను గావు పట్టే దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వరంగల్‌లోని ఓసిటీ, కరీమాబాద్, ఉర్సు, రంగశాయిపేటల్లో అంగరంగ వైభవంగా జరుగగా మంత్రి కొండా సురేఖ, మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తదితరులు పాల్గొని బోనమెత్తి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జనగామ, భూపాలపల్లి సహా పలుచోట్ల మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో తీసిన ర్యాలీలు కట్టిపడేశాయి. కాగా సాయంత్రం బోనాలతో ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

- నమస్తే నెట్‌వర్క్, జూలై 17


వరంగల్ ఓ సిటీలోని బీరన్న ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్‌లో) ఉత్సవ మూర్తులు


బీరన్న బోనాల సందర్భంగా కరీమాబాద్ బురుజు సెంటర్‌లో జన సందోహం


గావు పట్టిన గొర్రెపై నుంచి దాటుతున్న మహిళ


జనగామలో బీరన్నకు బోనం సమర్పించేందుకు వెళ్తున్న కురుమలు


కరీమాబాద్‌లో పోతరాజుల విన్యాసాలు


కాళేశ్వరం : కాళేశ్వర, ముక్తీశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

# ఘనంగా తొలి ఏకాదశి

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- గోదావరిలో పుణ్యస్నానాలాచరించిన ప్రజలు

నమస్తే నెట్‌వర్క్ : తొలి ఏకాదశి పర్వదినాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్‌లోని భద్రకాళీ, భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంతో పాటు ఆయా మండలాలు, గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కాళేశ్వరంలోని త్రివేణి సంగమంతోపాటు తీర ప్రాంతంలో ప్రజలు పుణ్య స్నానాలాచరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టారు.


ఐనవోలు: శాకంబరీ అలంకారంలో ఐనవోలు భ్రమరాంబికాదేవి


కాళేశ్వరం : త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలాచరిస్తున్న భక్తులు

# బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు..

- కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తా
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్, జూలై 17: తాను బీఆర్‌ఎస్‌ను వీడుతానని వస్తున్న వార్తల్లో నిజం లేదని, కావాలనే కొందరు సోషల్ మీడియా, యూట్యూబ్, వాట్సాప్ గ్రూప్‌ల్లో అసత్య ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. బుధవారం జనగామ జిల్లా పాలకుర్తిలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తానని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా కేసీఆర్ అధికారంలోకి వస్తారని చెప్పారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. వానకాలం పంట పెట్టుబడి సాయం అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నదన్నారు. దీంతో రైతులు అప్పులపాలవుతున్నారని ఆయన తెలిపారు. పంట రుణాల మాఫీపై కాంగ్రెస్ పాలకులు కొర్రీలు పెడుతున్నారని వివరించారు. తొలుత రూ.2 లక్షల రుణమాఫీ అని చెప్పి నేడు రూ.లక్ష మాఫీ చేస్తానమని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింప చేయాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారని తెలిపారు.. హామీలను నేరవేర్చే వరకు ప్రజాక్షేత్రంలో ఉండి పోరాడుతామన్నారు. ఇందుకోసం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**ప్రజలకు ఏకాదశి, మొహర్రం శుభాకాంక్షలు**

తొలి ఏకాదశి, మొహర్రం పండుగల సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాలకుర్తి, వర్ధన్నపేట నియోజకవర్గాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, రంగనేని సత్యనారాయణరావు, ఎన్నకూస యాకయ్య, బత్తిని గోపాల్, గర్వందుల మల్లేశ్, బెల్లి సోమయ్య, దొంతమల్ల గణేశ్, గిరగాని సమ్మయ్య, లకావత్ వెంకట్, నాగరాజు, పసుల వెంకట్, బత్తుల కొమురయ్య, బీరెల్లి రవివర్మ, బానోత్ శంకర్, జోగు గోపి ఉన్నారు.

# భక్తి శ్రద్ధలతో మొహర్రం

**చివరి రోజు పీరీల నిమజ్జనం**

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలను బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో ముజావర్లు, శివసత్తులు పీరీలను వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ముడుపులు చెల్లించి, కానుకలు సమర్పించారు. అగ్నిగుండ ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం పీరీల నిమజ్జనం చేశారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్


పీరీల ఊరేగింపుతో కోలాహలంగా మారిన వరంగల్ కోట


వాగు దాటుతున్న డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, వైద్య సిబ్బంది

# మీ సాహసానికి సెల్యూట్

- వైద్యం కోసం 32కి.మీ. పెనుగోలుకు డీఎంహెచ్‌వో అప్పయ్య
- గుట్టలు, వాగులు దాటి తిరుగుపయనం
- అభినందనలు తెలిపిన అధికారులు, స్థానికులు

వాజేడు, జూలై 17 : అడవిలో గుట్టపై ఉన్న ప్రజలకు వైద్యం అందించేందుకు ములుగు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య సాహసమే చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వేళ ములుగు జిల్లా వాజేడు అటవీ ప్రాంతంలోని పెనుగోలు గుట్టపై నివసించే గిరిజనులకు వైద్య పరీక్షలు చేసేందుకు వాగులు, గుట్టలు, వరదను సైతం లెక్కచేయలేదు. వాజేడు మండలకేంద్రానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉండే ఆ ప్రాంతానికి వెళ్లాలంటే మూడు గుట్టలెక్కి.. మూడు వాగులు దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మంగళవారం డీఎంహెచ్‌వో అప్పయ్య తన సిబ్బందితో కలిసి మంగళవారం పెనుగోలు గుట్టపైకి చేరుకొని అక్కడున్న 10 కుటుంబాలకు చెందిన 39 మందికి దోమతెరలను అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని అవసరమైన వైద్య సేవలందించారు. తిరుగు ప్రయాణంలో జోరువాన మొదలైనా వెరవకుండా బుధవారం సాయంత్రానికి వాజేడు చేరుకున్నారు. ఓ జిల్లాస్థాయి అధికారి వైద్యం కోసం పెనుగోలు గ్రామానికి 32 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. అప్పయ్యను ధైర్యసాహసాలకు సెల్యూట్ అంటూ అధికారులతో పాటు స్థానికులు అభినందించారు.

# దాశరథి స్ఫూర్తిని కొనసాగిద్దాం

- చిన్నగూడూరు మట్టిబిడ్డలు దాశరథి సోదరులు
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు


దాశరథి జన్మించిన ఇంటిస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

చిన్నగూడూరు, జూలై17 : నిజాం పాలనను వ్యతిరేకిస్తూ తన కలం ద్వారా నిప్పులు చెరిగి, తెలంగాణ ప్రజల్లో చైతన్యం కలిగించిన దాశరథి కృష్ణమాచార్యుల ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దామని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. దాశరథి కృష్ణమాచార్యులు, రంగాచార్యుల జన్మ స్థలమైన చిన్నగూడూరును బుధవారం ఆయన సందర్శించారు. ఆ మహనీయులు జన్మించిన ఇంటి స్థలం, స్థానిక రామాలయం, శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నగూడూరు మట్టి బిడ్డలు దాశరథి సోదరులు తెలంగాణ కోసం వీరోచితమైన ఉద్యమాన్ని కొనసాగించి దేశానికే మణిహారాలుగా నిలిచారన్నారు. ఆ మహనీయుల జన్మస్థలాన్ని సందర్శించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. 22న దాశరథి శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, వారి కీర్తిని భావితరాలకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ వేణు, గ్రామస్తులు ప్రమోద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 27,741 మంది అభ్యర్థులు
- ఆగస్టు 5వ తేదీ వరకు ఉదయం 9, మధ్యాహ్నం 2 గంటలకు పరీక్షలు
- 10 నిమిషాలు ముందుగానే చేరుకోవాలని అధికారుల వెల్లడి

హనుమకొండ చౌరస్తా, జూలై 17 : డీఎస్సీ పరీక్షలు గురువారం నుంచి నిర్వహించేందుకు టీజీపీఎస్సీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ప్రతిరోజూ రెండు సెషన్లలో కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. హనుమకొండలోని జయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, హసన్‌పర్తిలోని నోబుల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్, ఎర్రగట్టు గుట్ట వద్ద ఉన్న అయాన్ డిజిటల్ జోన్, భీమారం సమీపంలోని మోక్షిత కంప్యూటర్స్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక్కో అబ్జర్వర్‌ను నియమించారు. 13 రోజుల పాటు ప్రతిరోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు నిర్వహించే పరీక్షలకు అభ్యర్థులను రెండు గంటల ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. 10 నిమిషాలు ముందుగానే ఉదయం 8.50 గంటలకే గేట్లు మూసివేస్తారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే పరీక్షలకూ రెండు గంటల ముందుగానే కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 1.50 గంటలకే గేట్లు మూసివేస్తారు. తర్వాత వచ్చే వారిని లోపలికి అనుమతించరు. 2 గంటల నుంచి 4:30 వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష కేంద్రాల్లో బయోమెట్రిక్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేస్తారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఐదు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 27,741 మంది అభ్యర్థులు డీఎస్సీ పరీక్షలు రాయనున్నారు.

## పొంగి పొర్లుతున్న జంపన్న వాగు


ఎల్బాక వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న జీపీ సిబ్బంది

తాడ్వాయి, జూలై 17 : మండలంలోని మేడారం జంపన్నవాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నది. బుధవారం తెల్లవారు జాము నుంచి కురుస్తున్న భారీ వర్షం కారణంగా జంపన్నవాగులోకి వరద నీరు చేరడంతో ఎల్బాక వద్ద లోలెవల్ కాజ్‌వే నీట మునిగి ఎల్బాక, పడిగాపూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా నార్లాపూర్ గ్రామపంచాయతీ సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆటోతో పాటు వాగు దాటేందుకు ప్రయత్నించగా వరద ప్రవాహం ఉధృతంగా ఉండడంతో లోలెవల్ కాజ్‌వే నుంచి వాగులోకి ఆటో పడిపోయింది. గమనించిన స్థానికులు డ్రైవర్‌తో పాటు ఆటోను బయటకు తీశారు.

## పాలెం వాగు ప్రాజెక్టుకు జలకళ


వెంకటాపురం(నూగూరు) : పాలెం వాగు ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి వరద నీరు చేరుకుంది.

## ఉప్పొంగిన మోరంచ వాగు

**నిలిచిన రాకపోకలు**

గణపురం, జూలై 17 : మండలంలోని అప్పయ్యపల్లి, వెల్తుర్లపల్లి గ్రామాల మధ్యలో ఉన్న మోరంచవాగు ఉప్పొంగడంతో రాకపోకలు స్తంభించిపోయాయి మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి ఒక్కసారిగా వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో బుధవారం నుంచి మండల కేంద్రానికి వాగవతలి గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.